ప్రజాశక్తి
బుధవారం 26 ఫిబ్రవరి 2025 5 విజయనగరం

పోలింగు కేంద్రాన్ని పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఈ నెల 27న జిల్లాలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ఎస్.కోట పట్టణంలో పోలింగు కేంద్రాన్ని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ మంగళవారం పరిశీలించారు. పోలింగు కేంద్రాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సందర్శించి, పోలింగు కేంద్రం వద్ద భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎన్నిక సజావుగా, ప్రశాంతయుతంగా, పారదర్శకంగా జరిగేలా బందోబస్తు ఏర్పాటు చేయాలని, పోలింగు కేంద్రంకు చుట్టు పక్కల గుంపులుగా ప్రజలు గుమిగూడి ఉండకుండా చూడాలని, ఓటు హక్కు లేని వారిని, అనధికార వ్యక్తులను, వాహనాలను పోలింగు కేంద్రం పరిసరాల్లోకి అనుమతించ వద్దని అధికారులను ఆదేశించారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, సిఐ వి.నారాయణమూర్తి, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఎస్.కోట ఎస్ఐలు సిహెచ్. గంగరాజు, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఔను...! ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గ బరిలో ఒకే ఒక్క మహిళ. మిగిలిన తొమ్మిది మందీ పురుషులే ఉన్నారు. ఇందులోనూ ఒకరు తాజా, మరొకరు మాజీ ఎమ్మెల్సీ. అయినా సరే అందరి నోటా ఆ మహిళ గెలుపు మాటే వినిపిస్తోంది. ఆమె ఎవరో కాదు. ఉపాధ్యాయ ఉద్యమ నేత, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు, పలు సందర్భాల్లో పాలకపక్ష నాయకులను సైతం నిలువరించిన కోరెడ్ల విజయగౌరి. ప్రచారంలో ఆమె విశేష ఆదరాభిమానాలు చూరగొంటున్నారు.

ఒక మహిళ...9మంది పురుషులు

- హోరా హోరీగా ఎమ్మెల్సీ ఎన్నిక
- తాజా, మాజీలకు ముచ్చెమటలు
- ఎక్కడ విన్నా విజయగౌరి గెలుపు మాటే
- ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈనెల 7న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న విషయం విధితమే. ఈ ఎన్నిక బరిలో మొత్తం పది మంది ఉన్నారు. వీరిలో యుటిఎఫ్ బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి, టిడిపికూటమి బలపర్చిన పి.రఘువర్మ, పిఆర్‌టియు నాయకుడు గాదె శ్రీనివాసుల నాయుడు మధ్యే ప్రధాన పోటీ కనిపిస్తోంది. వీరిలోనూ విజయగౌరి ప్రచారంలోనూ, ఆదరణలోనూ మొదటి స్థానంలో వున్నారు. మిగిలిన ఇద్దరిలో శ్రీనివాసులు నాయుడు రెండు సార్లు, రఘువర్మ ఒక సారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేసినప్పటికీ ప్రస్తుత ఎన్నికల్లో వారికి ముచ్చెమటలు పడుతున్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. శ్రీనివాసుల నాయుడు ఎమ్మెల్సీగా ఉన్న హయాంలో ఏపార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వంతపాడుతూ కాలం వెళ్లబుచ్చారు. గత ఎన్నికల్లో యుటిఫ్ సహకారంతో గెలిచిన రఘువర్మ కూడా పదవి వరించాక ఏకంగా ఉపాధ్యాయ లోకాన్నే మర్చిపోయారు. ఉత్తరాంధ్రలోనూ, ముఖ్యంగా విజయనగరంలో గడిచిన ఆరేళ్లలో జరిగిన అనేక ఉపాధ్యాయ ఉద్యమాల్లో ప్రభుత్వాల తప్పుడు విధానాలపై నోరు మెదపకపోవడం ఇందుకు తార్కాణమని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో ఉత్తరాంధ్రలోనూ, ముఖ్యంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలోనూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మోయాల్సిన బాధ్యత యుటిఎఫ్ తీసుకుంది. ఇలా జరిగిన ఉద్యమాల్లో విజయగౌరి తనదైన పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలోనే విజయగౌరికి పిడిఎఫ్ తరపున పోటీచేసే అవకాశం లభించింది. ఉపాధ్యాయ సమస్యలు, విద్యారంగ పరిరక్షణ లక్ష్యంగా పిడిఎఫ్ ఇచ్చిన పిలుపు మేరకు తన ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి మరీ ఎన్నికల బరిలో దిగారు. యూనియన్లు, ప్రాంతాలకు అతీతంగా ఆదరణ కనిపిస్తోంది. విజయగౌరి గెలవు అనివార్యమైతే శాసన మండలిలో ఇరకాటంలో పడాల్సి వస్తుందని భావించిన కూటమి ప్రభుత్వం, ముఖ్యంగా టిడిపి తనకు అణిగిమనిగి ఉండే రఘువర్మకు మద్దతు ప్రకటించింది. అసలే రఘువర్మ వైఖరిపై అసహనంతో ఉన్న ఉపాధ్యాయులు ఎన్నికల మాట నిలబెట్టుకోని టిడిపిపై కూడా గుర్రుగా ఉంది. ఈ రెండు కారణాలు రఘువర్మకు తీవ్రమైన ప్రతికూల అంశాలుగా ఉన్నాయి. 'అధికార పార్టీతో జతకట్టిన అభ్యర్థి ఉపాధ్యాయ హక్కులు, విద్యారంగ పరిరక్షణ కోసం ప్రభుత్వాన్ని ఎలా ప్రశ్నించగలుగుతారు' అన్నది ఉపాధ్యాయుల భావన. తీరా మద్దతు ప్రకటించాక ఉపాధ్యాయుల్లో వ్యతిరేకత బహిర్గతం కావడంతో కూటమి ప్రభుత్వానికి ఏం చేయాలో అర్థం కావడం లేదు. దీంతో నేరుగా సిఎం చంద్రబాబే రంగంలో దిగి ఎంపీ, ఎమ్మెల్సీలు, చివరికి మంత్రులు కూడా ఎన్నికల ప్రచారానికి ఉసుగొల్పారు. వీరంతా స్కూళ్లు, కాలేజీల్లో తిరుగుతూ ఓట్ల కోసం పడరాని పాట్లు పడుతున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు. తమ ప్రచారం వల్ల ప్రయోజనం లేదని తెలిసినా అధినేత చెప్పాక తప్పదుగా అంటూ కొందరు ముందుకు సాగుతున్నారు.

ఇక రెండుసార్లు ఉపాధ్యాయ ఓట్లతో ఎమ్మెల్సీగా అందలమెక్కిన శ్రీనివాసులు నాయుడు ప్రోటోకాల్ పొందడానికే పరిమితమయ్యారు. ఆయన పదవీ కాలంలో ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలు సాధించేందుకుగానీ, నూతన విద్యావిధానం పేరిట పాఠశాలల విలీనం, అంతకు ముందు రేషనలైజేషన్ పేరిట స్కూళ్ల మూసివేతకు వ్యతిరేకంగా గానీ, ఉపాధ్యాయులు ఎదుర్కొన్న సమస్యలపై గాని పనిచేయలేదు. బహుశా అందుకే గత ఎన్నికల్లోనే ఉపాధ్యాయులు శ్రీనివాసనాయుడ్ని పక్కనబెట్టారు. ఇలా వీరిద్దరికీ ఓట్లు వేసి మోసపోయిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు విజయగౌరివైపు చూస్తున్నారు. విజయగౌరి గెలుపు కోసం యుటిఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాలతో పాటు పిడిఫ్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆమె కుటుంబ నేపథ్యం, పోరాట చరిత్ర ఇందుకు దోహపడుతున్నాయి. పలు ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాల నుంచి ప్రాంతాలకు అతీతంగా ఆదరణ కనిపిస్తోంది. ఈనేపథ్యంలో విజయగౌరి విజయం తథ్యం అనే చర్చ ముమ్మరంగా సాగుతోంది. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార గడువు మంగళవారం సాయంత్రంతో ముగిసింది.

పుణ్యగిరిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి
- పుణ్యగిరి కొండపై తాత్కాలిక కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పుణ్యగిరి ఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయం, సన్యాసయ్యపాలెం వద్ద సన్యాసేశ్వరస్వామి ఆలయాలకు శివరాత్రి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పోలీసుశాఖ ఏర్పాటు చేస్తున్న బందోబస్తు, భద్రత ఏర్పాట్లను ఎస్‌పి వకుల్ జిందాల్ మంగళవారం పర్యవేక్షించారు. పుణ్యగిరి కొండపైకి వెళ్ళి, శివుడ్ని దర్శించుకొని, పూజలు నిర్వహించారు. అనంతరం, ఆలయ పరిసరాల్లో క్యూ లైన్లు ఏర్పాటు, భద్రత ఏర్పాట్లును, సిసి కెమెరాల ఏర్పాటు, వాటి పని తీరును పరిశీలించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ శివరాత్రి పర్వదినాన పుణ్యగిరి, సన్యాసయ్య పాలెంకు సుమారు లక్షన్నర మంది భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున, ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సుమారు 300మంది పోలీసులు, 100మంది ఎన్.సి.సి. క్యాడట్లతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విజయనగరం చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పుణ్యగిరికి వచ్చే ప్రత్యేక ఆర్టీసి బస్సులను పుణ్యగిరి కొండ వరకు అనుమతిస్తామన్నారు. ఆటోలు, వాహనాలను ఎస్.కోట వరకు అనుమతించి, వాటిని పార్కింగు చేసేందుకు ప్రత్యేకంగా కేటాయించిన ప్రాంతాల్లోకి అనుమతిస్తామన్నారు. వాహనాల పార్కింగుకు ఎస్.కోటలోని నందిత హోటల్ వెనుక భాగం లోను, పంచాయతీ పార్కు, జిజె కాలేజ్ గ్రౌండు, అలంకార్ థియేటరు, ఇన్ స్టే హోటల్ ఎదురుగాగల ఖాళీ స్థలం, ముత్యాలమ్మ దేవాలయం వద్ద ఖాళీ స్థలాలను వాహనాల పార్కింగుకు కేటాయించామన్నారు. పుణ్యగిరి కొండపైన ప్రధాన ఆలయం, క్యూ లైన్లు, పుట్టదార, కోటి లింగాల రేవు, దారగంగమ్మ ప్రాంతాల వద్ద బందోబస్తు ఏర్పాటుపై అధికారులకు ఎస్‌పి సూచనలు చేసారు. భద్రత ఏర్పాట్లను పోలీసు అధికారులు పర్యవేక్షించేందుకు పుణ్యగిరి కొండపైన, కొండ దిగువన తాత్కాలిక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎగ్జిబిషన్స్ నిర్వహించే రైతు బజారు, ఆకుల డిపోల వద్ద కూడా బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, ఎస్.కోట సిఐ వి.నారాయణమూర్తి, ఎస్‌బి సిఐలు ఎవి లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఎస్.కోట ఎస్ఐలు సిహెచ్. గంగరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లోనైనా ప్రతిపక్ష హోదా ఇస్తారు

ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి కలల భ్రమలో నుంచి బయటికి వచ్చి, వాస్తవాలను గ్రహించి మళ్లీ అధికారంలోకి వద్దాం అనే ఆలోచనను పక్కనపెడితే ప్రజలు వచ్చే ఎన్నికల్లోనైనా ప్రతిపక్ష హోదా ఇస్తారని ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో వైసిపి నేత జగన్ ప్రవర్తించిన తీరును వారు ఖండించారు. గత ప్రభుత్వంలో జరిగిన దుర్మార్గపు పాలన, వనరులు దోపిడీ, అరాచకాలు గురించి లేవనెత్తారు. ముఖ్యంగా ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా గురించి సభా సంస్కారం, ప్రజా సమస్యలు పక్కనపెట్టి అసెంబ్లీ నుంచి బయటికి రావటం విడ్డూరమని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడితే వచ్చే ఎన్నికల్లోనైనా ప్రజలు ప్రతిపక్ష హోదా ఇస్తారని ఎద్దేవా చేశారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, పిల్లా విజయ్ కుమార్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విజయగౌరిని గెలిపించండి

ప్రజాశక్తి-బొబ్బిలి

శాసనమండలిలో ఉద్యోగులు, టీచర్లు, కార్మికులు,ప్రజల తరపున మాట్లాడే పిడిఎఫ్ అభ్యర్థి విజయ గౌరిని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ బొబ్బిలి నియోజకవర్గం ఇంఛార్జి మువ్వల శ్రీనివాసరావు మేధావులైన టీచర్లకు విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక హామీలను ఎగ్గొట్టడానికి చూస్తుందని అన్నారు. సూపర్ సిక్స్, మెగా డిఎస్‌సి, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, మహిళలకు ఫ్రీ బస్సు, రైతు భరోసా ఉద్యోగులు కార్మికులు సమస్యలు ఇవేవీ టిడిపి ప్రభుత్వం పరిష్కరించలేదని అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఏ మొఖం పెట్టుకొని టీచర్లను టిడిపి నాయకులు ఓటు అడుగుతారని అన్నారు. విజ్ఞులైన టీచర్లందరూ ఆలోచించి ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల సమస్యలపై నిరంతరం శాసనమండలిలో పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మేధావుల సభను కూడా రాజకీయం చేసి ప్రశ్నించే వాళ్లు రాకుండా ఏకపక్షంగా పరిపాలన సాగించే దిశగా తెలుగుదేశం పార్టీ పనిచేస్తుందని విమర్శించారు.

ఉపాధిలో ప్రగతి చూపకపోతే చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

సగటు వేతనాన్ని రూ.250కు పెంచాలి
వంద రోజుల పని కల్పన లక్ష్యాలు పూర్తి చేయాలి
ఉపాధిహామీపై కలెక్టర్ అంబేద్కర్ సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉపాధిహామీ కింద చేపట్టిన సిసి రోడ్లు, డ్రైన్లు, బిటి రోడ్లు, గోకులాలు, వేతనాలు, పని దినాల కల్పనలో ప్రగతి కనిపించకపోతే, సంబంధిత ఎఇలు, ఎపిఒలపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ హెచ్చరించారు. ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన సాధారణ పనులు, కన్వర్జెన్సీ వర్క్సపై కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు విడతలుగా సుమారు రూ.184 కోట్ల విలువైన 2900 కన్వర్జెన్సీ పనులు మంజూరయ్యాయని, వీటిలో 1728 పనులు పూర్తికాగా, మరికొన్ని ప్రగతిలో ఉన్నాయని తెలిపారు. ఇంకా ప్రారంభం కాని 261 పనులను వచ్చే సోమవారంలోగా ప్రారంభించాలని ఆదేశించారు. విజయనగరం, గజపతినగరం, గరివిడి, గంట్యాడ, దత్తిరాజేరు డెంకాడ, జామి, వేపాడ మండలాల్లో ప్రారంభం కాని పనులు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు పనులను పూర్తిచేయడంలో భోగాపురం, విజయనగరం, డెంకాడ, గజపతినగరం, గంట్యాడ, గరివిడి, వంగర, బొండపల్లి, గుర్ల, జామి మండలాల పనితీరు అధ్వాన్నంగా ఉందని అన్నారు. వారం లోగా ప్రతీ మండలంలో కనీసం 50 శాతం పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. రాజాం, వేపాడ, పూసపాటిరేగ, బాడంగి మండలాల పనితీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటివరకు సుమారు రూ.62 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తి అయ్యాయని, మిగిలిన రూ.120 కోట్లలో వారానికి రూ.30 కోట్లు ఖర్చు చేసేవిధంగా లక్ష్యాలను నిర్ధేశించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న రూ.51 కోట్ల విలువైన బిల్లులు ఈ వారంలో వచ్చే అవకాశం ఉందని చెప్పారు. బిటి రహదారుల నిర్మాణంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు రూ.47 కోట్లతో 60 కిలోమీటర్ల మేర 39 బిటి రోడ్ల నిర్మాణానికి పనులు మంజూరు చేయగా, ఇప్పటివరకు కేవలం రూ.3కోట్లు విలువైన ఒక్క పని మాత్రమే పూర్తి అయ్యిందని చెప్పారు. ఉపాధి పథకంలో పనిచేస్తున్న ఎపిఒల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు పని కల్పించడంలో ఎందుకు నిర్లక్ష్యం చూపిస్తున్నారని నిలదీశారు. ఇప్పటివరకు 1016 గోకులాలను మంజూరు చేయగా, ఇంకా పూర్తి చేయకపోవడం పట్ల అంసతృప్తి వ్యక్తం చేశారు. సుమారు 54వేల కుటుంబాలకు వంద రోజుల పని కల్పించాల్సి ఉండగా, ఇప్పటివరకు 13,247 కుటుంబాలకు మాత్రమే పని కల్పించారని అన్నారు. వారంలో ప్రతీ మండలంలో కనీసం 30 శాతం ప్రగతి కనిపించాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయితీరాజ్ ఎస్ఈ ఎం.శ్రీనివాస్, డ్వామా పిడి ఎస్.శారదాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తుతా.. అవకాశమివ్వండి

- మండలి ఎన్నికల్లో రాజకీయ జోక్యం భావ్యంకాదు
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఈ నెల 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే మండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తుతానని యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. మంగళవారం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ శాసనమండలి అంటే పెద్దల సభని, అటువంటి సభలో పిడిఎఫ్ తరపున గెలుపొంది ఎమ్మెల్సీలుగా పనిచేస్తున్న అభ్యర్థులు ఎంతో హుందాతనంగా, రాజకీయాలకు అతీతంగా.. ఉపాధ్యాయుల, ఉద్యోగుల, పెన్షనర్ల, కార్మికుల సమస్యలపై పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. విద్యా రంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యలపై తాను పోరాటం చేస్తానన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన జిఒ 117 వల్ల అనేక పాఠశాలలు మూతపడ్డాయని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ఆ జిఒను రద్దు చేస్తామని గెలిచిన టిడిపి కూటమి ఆ తరువాత ఆ మాటను మరిచిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలల ఉనికి లేకుండా సన్నాహాలు చేస్తోందని తెలిపారు. అదే జరిగితే మరిన్ని పాఠశాలలు మూతపడటం, ఉపాధ్యాయుల పోస్టులు లేకుండా పోవడం తథ్యమన్నారు. తాను ఎమ్మెల్సీగా నెగ్గితే జిఒ 117 రద్దుకు పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. పవిత్రమైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను కొన్ని రాజకీయ పార్టీలు కలుషితం చేశాయని, రాజకీయ పార్టీలు జోక్యం ఈ ఎన్నికల్లో ఉండటం భావ్యం కాదని అన్నారు. తాను ఎన్నో మహిళా ఉద్యమాలలో పాల్గొని, ప్రజా సేవా కార్యక్రమాలు చేశానని తెలిపారు. మండలి ఎన్నికల్లో గెలిస్తే రాజకీయాలకు, అవినీతికి తావులేకుండా నిజాయితీగా సేవ చేస్తానని, పిఆర్‌సి, ఇతర సమస్యలపై శాసన మండలిలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. విద్యారంగాన్ని దెబ్బతీసే పార్టీలు బలపరిచే అభ్యర్థుల వల్ల సమస్యలు పరిష్కారం కావన్నారు. బ్యాలెట్ పేపర్‌లో 1వ నెంబర్‌లో ఉన్న తనకు ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.లక్ష్మీరాజా, విశాఖ జిల్లా అధ్యక్షులు డి.నాగేశ్వరరావు, కార్యదర్శి అంబేద్కర్, ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం విశాఖ జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

పోక్సో కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

పెదమానాపురం పోలీసు స్టేషనులో 2023 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు దత్తిరాజేరు మండలం పెదమానాపురం గ్రామానికి చెందిన మారోజు వెంకటేష్ (25)కు పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు.

పెదమానాపురం గ్రామానికి చెందిన ఒక బాలిక గజపతినగరంలో ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతూ బస్ పాస్ కోసం 2023 జూన్ 29న విజయనగరం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె తల్లి ఫిర్యాదు మేరకు పెదమానాపురం పోలీసులు మిస్సింగ్ కేసు పెట్టి దర్యాప్తు చేపట్టారు. మిస్సింగ్ అయిన బాలికను ట్రేస్ చేసి స్టేషన్‌కు తీసుకువచ్చి, విచారణ చేయగా పెదమానాపురం గ్రామానికి చెందిన నిందితుడు మారోజు వెంకటేష్ గజపతినగరంలో ఒక ప్రైవేట్ కళాశాలలో టీచరుగా పనిచేస్తూ, పెదమానాపురం గ్రామంలో ట్యూషన్ చెప్పేవాడని, స్కూలులో చదువుతున్న సమయంలో అతని వద్దకు ట్యూషన్ కోసం వెళ్లిన ఆ బాలికతో పరిచయం ఏర్పరుచుకొని, ఆమెను పెండ్లి చేసుకుంటానని నమ్మించి, ఆమెను వేరే ప్రాంతానికి తీసుకు వెళ్లి అద్దె ఇంట్లో ఉంచినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ కేసును అప్పటి డిఎస్‌పి పి.శ్రీనివాసరావు దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేశారు. బాలికను అపహరించి అత్యాచారానికి పాల్పడినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడికి 20ఏళ్ల జైలు, రూ.4వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నిర్ణీత సమయాన్ని కల్లా నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఇంజనీరింగ్ సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవి కార్యాచరణ, నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతి, చేపట్టాల్సిన పనులు వంటి అంశాలపై చర్చించారు. వేసవి కాలంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు నిర్ణీత సమయాన్ని కల్లా పూర్తి కావాలన్నారు. తాగునీటి పంపిణీలో అలసత్వం ఉండరాదన్నారు. 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా వాటర్ ట్యాంకులను శుభ్రపరిచే విధంగా పర్యవేక్షణ ఉంచాలన్నారు. సమావేశంలో ఇఇ టి.రాయల్ బాబు, డిఇలు మణికుమార్, శ్రీనివాసరావు, ప్రసాద్, ఎఇలు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలకు పన్నులు వేయాలి

నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య మంగళవారం 28వ డివిజన్ లో పర్యటించారు. రింగ్ రోడ్డు నుండి ప్రారంభమైన పర్యటన ఎంఎస్ఎన్ కాలనీ తదితర ప్రాంతాల్లో సాగింది. రహదారులపై భవన నిర్మాణ సామగ్రిని విచ్చలవిడిగా ఉంచుతున్నారని, వాటిని తక్షణమే తొలగించాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయని వాటన్నిటికీ ఖాళీపన్నులు విధించి, వసూలు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. పర్యటనలో టిపిఆర్ఒ సింహాచలం, పారిశుధ్య పర్యవేషకులు షాలేం రాజు, వివిధ విభాగాల సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

6న చలో విజయవాడ

ఆరోజు విధులకు హాజరు కాలేమని డిఎంహెచ్ఒకు ఆశా వర్కర్లు యూనియన్ వినతి

విజయనగరం టౌన్ : మార్చి 6వ తేదీన ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఛలో విజయవాడ కార్యక్రమంలో జిల్లాలో ఉన్న ఆశావర్కర్స్ అందరూ పాల్గొంటున్నారని, అందువల్ల ఆరోజు విధులకు హాజరు కాలేమనిజిల్లా వైద్య శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్న సిబ్బందికి ఎపి ఆశా వర్కర్లు యూనియన్ జిల్లా కార్యదర్శి బి.సుధారాణి వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో తాము ధర్నా చేసినప్పుడు పై అధికారులు కొన్ని హామీలు ఇచ్చారని, వాటికి జీవో రూపం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ప్రధానంగా పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, సెలవులు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్ ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని రూ.10 లక్షలు ఇవ్వాలని, స్థానికంగా వచ్చే సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో యూనియన్ సభ్యులు మహాలక్ష్మి, రాధ, పద్మ పాల్గొన్నారు.

పోస్ట్ బాక్స్ లో ఉత్తరాలు వేసి నిరసన తెలుపుతున్న కార్మికులు

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయండి

ముఖ్యమంత్రికి పోస్టు కార్డు ద్వారా మున్సిపల్ కార్మికుల విజ్ఞప్తి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తూ నిర్ణయం చేయాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) విజయనగరం కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పోస్ట్ కార్డులను పంపించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఎ.జగన్మోహన్‌రావు, బి.భాస్కరరావు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలైనా మున్సిపల్ కార్మికులకు గత ప్రభుత్వం ఇచ్చినా ఏ ఒక్క హామీని ఈ ప్రభుత్వం అమలు చేయలేదని, 60 ఏళ్లు నిండాయనే కారణంతో కార్మికులను రిటైర్మెంట్ చేస్తున్నారని అన్నారు. ఫిబ్రవరి 6న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆప్కాస్‌ను రద్దు చేస్తూ నిర్ణయం జరిగినట్లు వచ్చిన వార్తతో కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని , థర్డ్ పార్టీ విధానం లోకి నెట్టకుండా మొత్తం కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె ఒప్పంద హామీలైన రిటైర్మెంట్ బెనిఫిట్స్, మట్టిఖర్చులు, ఎక్స్‌గ్రేషియా పెంపు, 62ఏళ్ల వరకు కొనసాగింపు జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే విజయ వాడలో మార్చి5న ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలోయూనియన్ నాయకులు కుమారి, రమ, రాధా, నాయకులు తిరుమలరావు, పైడిరాజు, రాఘవ, రమణ, రామారావు, అప్పలరాజు పాల్గొన్నారు.

రామతీర్థంలో ఏరులై పారుతున్న మద్యం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థంలో విచ్చల విడిగా మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. మంగళవారం శ్రీరామని సన్నిధిని ఆనుకుని పలు వీధుల్లో అక్రమ వ్యాపారస్తులు మద్యాన్ని ఏరులై పారించి దర్శనం కోసం వచ్చిన వారిని మత్తులో ముంచారని తెలిసింది. శివరాత్రి జాతర పురస్కరించుకొని నెల్లిమర్లకు చెందిన మద్యం లైసెన్స్ వ్యాపారి ఆ గ్రామానికి చెందిన వారితో ఒప్పందం కుదుర్చుకుని జాతరలో రెండు రోజుల పాటు మద్యం అమ్మకానికి సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో భాగంగానే మంగళవారం నుంచి అక్కడ మద్యం అమ్మకాలు జోరందుకున్నట్లు తెలిసింది. శివరాత్రిని పురస్కరించుకుని రామతీర్థం రామ స్వామి దేవస్థానం పరిధిలో విచ్చల విడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నా మాకెందుకులే అని ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో కూరుకుపోయారని వర్గాలు తీసుకోవాలని పలువురు భక్తులు మండిపడుతున్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ ఎస్ నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్, పాఠశాల రికార్డులు, డొక్కా సీతమ్మ భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ చిరంజీవి, అసిస్టెంట్ పాల్గొన్నారు.

గుర్లగెడ్డకు రూ.20కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి- మెంటాడ

గుర్ల గెడ్డ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో సుమారు రూ.20కోట్లు కేటాయించాలని ప్రజా సంఘాల నాయకులు రాకోటి రాములు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 27ఏళ్లుగా గుర్ల గెడ్డ మిని ప్రాజెక్టు నిర్మాణం ఆహేరని దీంతో సుమారు 5వేల ఎకరాలకు సాగునీరు లేక రైతుల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గత వైసిపి, టిడిపి పాలనలో నిధులు మంజూరు చేయాలని పలుమార్లు అర్జీలు ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు పెట్టినప్పటికీ ఫలితం శూన్యమే అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గుర్లగెడ్డ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇవాల్సినన్ని కృషి చేస్తానని ప్రస్తుత మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీ ఇచ్చారని ఈ హామీ ప్రకారం నిధులు మంజూరు చేసి ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీటిని అందించాలన్నారు.

కొత్త రోడ్డుకు ప్రతిపాదన

ప్రజాశక్తి - కొత్తవలస

వియంఆర్‌డిఎ విజన్ 2020-40లో భాగంగా మండలంలోని చింతలపాలెం రెవెన్యూ పరిధి దేవాడతుమ్మపాలెం పంచాయతీ మంగపాలెం జంక్షన్ (మూడురోడ్లు) వద్దనున్న జనచైతన్య లేఅవుట్ నుంచి ప్రవేశిస్తూ చింతలపాలెం రెవెన్యూలోని 103 సర్వే నంబరు, వయా విశాఖ జిల్లా, ఆనందపురం మండలం, రామవరం మీదుగా గండిగుండం హైవేను కలుపుతూ కొత్త రోడ్డు నిర్మాణానికి గాను ప్రభుత్వం ప్రతిపాదించినట్లు తహశీల్దార్ బి.నీలకంఠరావు విలేకరులకు తెలిపారు. ప్రతిపాదనకు సంభందించి వియంఆర్‌డిఎ విడుదల చేసిన రోడ్ మ్యాప్‌ను ఆయన మంగళవారం ప్రదర్శించారు. ప్రజల నుంచి అభ్యంతరాలు, భూ సేకరణ తదితర అంశాలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలుంటాయని ఆయన చెప్పారు.

నాయీ బ్రాహ్మణ సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - బొబ్బిలి

నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక శ్రీవేణుగోపాల స్వామి ఆలయ మండపంలో మంగళవారం నాయి బ్రాహ్మణ సంఘం సమావేశం నిర్వహించి నూతన కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బి అప్పారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రేజేటిపల్లి శ్రీనివాసరావు, అధ్యక్ష, కార్యదర్శులుగా బి.చిన్నారావు, ఆర్.రమేష్, ఉపాధ్యక్షులుగా ఎస్ వెంకటప్పారావు, కోశాధికారిగా చిన్నారావు, సహాధాయకులుగా జి.సత్యారావు, ఎస్.గవరయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.రాము, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయి బ్రాహ్మణుల సమస్యలు పరిష్కారానికి పని చేస్తామని నూతన కమిటీ ప్రకటించింది.

నేడు కొత్తపాలెంలో జాతర

ప్రజాశక్తి - బొండపల్లి

మండలంలోని కొత్తపాలెంలో మహా శివరాత్రి సందర్భంగా బుధవారం కృష్ణమ్మ పేరంటాలు జాతర మహోత్సవం జరగనుందని మాజీ వైస్ ఎంపిపి బొద్దు రాము, సర్పంచ్ సత్యవతిలు తెలిపారు. బుధవారం ఉదయం నుండి జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం నాలుగు గంటల నుండి గుర్రపు స్వారీ ప్రదర్శన, ఎడ్ల బండ్ల ప్రదర్శన జరుగుతుందని, ఈ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ జాతర మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఫ్రీ చికెన్‌కు ఎగబడ్డ జనం

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక తాండ్రపాపారాయ విగ్రహం జంక్షన్‌లో మంగళవారం నిర్వహించిన ఫ్రీ చికెన్, గుడ్లకు జనం ఎగబడ్డారు. బర్డ్ ఫ్లూ వ్యాధి లేదని చెప్పేందుకు కోళ్ల ఫారం వ్యాపారులు చికెన్, ఎగ్ మేళా నిర్వహించారు. ఉడకబెట్టిన చికెన్, ఉడకబెట్టిన గుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. చికెన్, గుడ్లు తీసుకునేందుకు జనం క్యూ కట్టారు. జిల్లాలో ఎటువంటి బర్డ్ ఫ్లూ లేదని, చికెన్, గుడ్లు తినవచ్చునని వ్యాపారులు అన్నారు.

ఘనంగా వీడ్కోలు సభ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సభ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు ఎలా వ్రాయాలి సన్నద్ధం కావాలో సూచించారు. పరీక్ష ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులందరూ మంచి మార్కులు సాధించి పాఠశాలకు పుట్టిన గ్రామానికి మంచి పేరు తేవాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను పొందాలని ఆశీర్వదించారు. ఈ క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్రి భాస్కరరావు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు భద్రత ముఖ్యం

ప్రజాశక్తి - కొత్తవలస

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు భద్రత ఎంతో అవసరమని, దీనిని నిజ జీవితంలో భాగంగా విద్యార్థులు పాటించాలని పోక్సొ డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ వి.సురేష్ అన్నారు. మంగళవారం సాయంత్రం కంటకాపల్లి హైస్కూల్లో షటిల్ కోర్ట్, వాలీబాల్ కోర్టు నిర్మించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు విద్య, క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, భద్రతా జాగ్రత్తలు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్. సన్యాసి రావు, డీఈఓ, స్కూల్ హెచ్ఎం సూర్య భాస్కర్, డీఈఓ ఈహెచ్ఎస్, స్కూల్ హెచ్ఎం అరుణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాంసం విక్రయాలు నిషేధం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని నగరంలో మాంసం విక్రయాలను చేపట్టరాదని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం మాంసం దుకాణాలను మూసివేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమించి ఎవరైనా మాంసవిక్రయాలు చేపడితే దుకాణాలను సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముగిసిన జ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

సంకల్ప్ పథకం కింద రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జన శిక్షణ సంస్థాన్ ద్వారా నెల రోజుల పాటు ఇచ్చిన జ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణ మంగళవారం ముగిసిందని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ శిక్షణను మహిళలంతా సద్వినియోగం చేసుకుని పొందాలని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని తెలిపారు. జన శిక్షణ సంస్థాన్ చైర్మన్ డి.రమేష్, డైరెక్టర్ వి.హరీష్, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎడిఎస్‌డిఒ షణ్ముఖరెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి టి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మెయిన్స్ మోడల్ పరీక్ష నిర్వహణ

ప్రజాశక్తి-విజయనగరం

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో నాయుడు ఎగ్జామ్ వారియర్స్ డైరెక్టర్ రాము నాయుడు ఆధ్వర్యంలో కానిస్టేబుల్ మెయిన్స్ మోడల్ పరీక్ష నిర్వహించారు. ఈ మోడల్ పరీక్ష కు సుమారుగా 157 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇటువంటి పోటీ పరీక్షల మోడల్ పరీక్ష నిర్వహించడం వలన అభ్యర్థులకు చాలా ఉపయోగపడుతుందని కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ రావు అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణి తదితరులు పాల్గొన్నారు.

సర్వం సిద్ధం

విద్యుత్తు కాంతులతో దగదగ లాడుతున్న రామతీర్థం ఆలయం

● రామతీర్థం, పుణ్యగిరి, సంగాంలో పూర్తయిన శివరాత్రి ఏర్పాట్లు ● 650 మంది పోలీసులతో బందోబస్తు ●ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి, ఆర్‌డిఒ, ఎసి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో ఈ నెల 26, 27తేదీల్లో జరగనున్న శివరాత్రి జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముఖ్యంగా ఏటా రామస్వామి దేవస్థానంలో శివరాత్రి జాతర జరపడం ఆనవాయితీగా వస్తుంది. వాస్తవానికి శివరాత్రి రోజున అందరూ శివునికి పూజలు చేస్తే రామతీర్థంలో శివునితో పాటు శ్రీరామునికి కూడా ప్రత్యేక పూజలు చేస్తారు. ఇక్కడ శ్రీరామునికి ఉమా సమేత సదాశివ స్వామి క్షేత్ర పాలకునిగా ఉండటంతో ఇద్దరికీ కలిపి పూజలు చేస్తారు. శివరాత్రి నాడు భక్తులు జాగరణ చేసి సీతారామ సమేత లక్ష్మణస్వామిని, ఉమా సమేత సదాశివ స్వామిని దర్శించుకుంటారు.

రెండో భద్రాద్రిగా గుర్తింపు పొందిన ఉత్తరాంధ్ర ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శివరాత్రికి సర్వం సిద్ధమైంది. ఏటా జరిగే ఈ జాతరకు లక్షల్లో భక్తులు వస్తారని యంత్రాంగం అంచనా వేసింది. ఈ మేరకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్ద ఎత్తున తెలుగు రాష్ట్రాలతో పాటు ఒరిస్సా, చత్తీష్‌గడ్ వంటి రాష్ట్రాల నుంచి కూడా భక్తులు రానుండటంతో 200 మంది పోలీసులతో గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడికక్కడ తాగునీటి, మజ్జిగ పంపిణీకు దేవస్థానంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. భక్తులు దర్శనం నిమిత్తం బారీకేడ్లు ఏర్పాటు చేశారు. పుణ్యగిరిలోని ఉమారామలింగేశ్వరాలయం శివరాత్రికు ముస్తాబైంది. ఇక్కడ ఏర్పాట్లును ఎస్‌పి వకుల్ జిందాల్ పరిశీలించి 300 మందితో బందోబస్తు నిర్వహిస్తున్నామని చెప్పారు. వంగర మండలంలోని సంగాం ఆలయం కూడా శివరాత్రికి సిద్ధమైంది.

రెండు రోజులు జాతర

రెండు రోజుల పాటు జరిగే శివరాత్రి జాతరలో ఉత్తరాంధ్ర జిల్లాలతో బాటు ఒడిస్సా రాష్ట్రానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామస్వామిని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా దేవస్థానం సహాయ కమిషనర్ వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. సతివాడ పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యం, రామ కోనేరు వద్ద స్నానాలు గదులు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం పులిహోర ప్రసాదం, రెండు చోట్ల అన్నదానం చేయనున్నారు. భక్తుల కోసం 25వేల లడ్డు ప్రసాదాలు తయారు చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు నెల్లిమర్ల నుంచి వచ్చే వాహనాలకు సీతారాముని పేట వద్ద, సతివాడ నుంచి వచ్చే వాహనాలకు డి.నెలివాడ వద్ద ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా 200 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అదే రోజు నీలాచలకొండ, బోడికొండ మీద వెలసిన కోదండ రామ స్వామి ఆలయంలో శిఖర దర్శనం జరుగుతుంది. భక్తుల ప్రయాణ సౌకర్యార్థం విజయనగరం డిపో నుంచి 40 బస్సులు, శ్రీకాకుళం డిపో నుంచి 30 బస్సులను ఏర్పాటు చేశారు.

జాతర ఏర్పాట్లును ఆర్‌డిఒ పరిశీలన

రామ తీర్థం రామస్వామి శివరాత్రి జాతర ఏర్పాట్లును ఆర్‌డిఒ దాట్ల కీర్తి మంగళవారం పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో కలిసి జాతరలో ఏర్పాట్లు పై దేవస్థానం అధికార్లతో చర్చించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమం లో దేవస్థానం సహాయ కమిషనర్ వై.శ్రీనివాస్, తహశీల్దార్ పి.సుదర్శన రావు, నగర పంచాయతీ కమిషనర్ కె. అప్పలరాజు పాల్గొన్నారు.

ఇఒతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ కీర్తి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే: ఎస్ఐ

రామతీర్థం శివరాత్రి జాతరకు వచ్చే భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ బి.గణేష్ కోరారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ట్రాఫిక్ మళ్లింపులో భాగంగా రణస్థలం నుంచి విజయనగరం వెళ్లవలసిన వారు రామతీర్థం ఊర్లో నుంచి కాకుండా బైపాస్ రోడ్డు చెరువు గట్టు మీదగా సీతారాముని పేట జంక్షన్ నుంచి వెళ్లాల్సి ఉంటుందన్నారు. రణస్థలం వైపు నుంచి దర్శనానికి వచ్చే భక్తులు నెలివాడ వద్ద ప్రకృతి లేఅవుట్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. నెల్లిమర్ల నుంచి సతివాడ రోడ్డు వైపు వెళ్లే ప్రయాణికులు సీతారామునిపేట జంక్షన్ నుంచి బైపాస్ గట్టు మీదుగా నెలివాడ మీదుగా వెళ్ళవలసి ఉంటుందన్నారు. ఈ రూట్లో దర్శనానికి వచ్చే భక్తులకు సీతారాముని పేట జంక్షన్ దగ్గర పార్కింగ్ ప్లేసులు ఏర్పాటు చేశామన్నారు. రామతీర్థం జంక్షన్‌లో ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని రామతీర్థం నుంచి నెల్లిమర్ల, విజయనగరం వైపు వెళ్లే ప్రయాణికులు నెల్లిమర్ల రైల్వే బ్రిడ్జి దగ్గర నుండి పూడమ్మ తల్లి గుడి వైపుగా ఉన్న రోడ్డు నుంచి మిమ్స్ కాలేజీ వైపుగా ట్రాఫిక్ మళ్లించామన్నారు. పూసపాటి రేగ వైపు నుంచి వచ్చే భక్తులకు ధనాన్నపేటకు వెళ్లే మార్గంలో చెరువుగట్టు దగ్గర పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌టిసి బస్సులు తప్ప మరే ఇతర వాహనాలనూ సీతారామునిపేట జంక్షన్ నుంచి లోపలికి అనుమతించమని స్పష్టం చేశారు. సీతారామునిపేట చెరువు గట్టు రోడ్డుమీద ఎటువంటి వాహనాలనూ పార్కింగ్ చేయకూడదన్నారు. భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు పరిశీలన

వంగర: మండలంలోని సంగాంలో సంగమేశ్వర ఆలయం వద్ద బుధవారం నుంచి వారం రోజులపాటు మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష మంగళవారం సంగమేశ్వర ఆలయం వద్దకు చేరుకుని ఏర్పాట్లు పరిశీలించారు. అంతకుముందు కుటుంబ సమేతంగా ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో శ్యామలరావుతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు పిఒ వెల్లడించారు.

పటిష్ట పోలీసు బందోబస్తు

మండలంలోని సంగాంలో జరగనున్న శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చీపురుపల్లి డిఎస్‌పి రాఘవులు తెలిపారు. ఈ మేరకు ఆయన సంగాంలో గల సంగమేశ్వర ఆలయం వద్దకు మంగళవారం చేరుకుని విధులు నిర్వహించనున్న పోలీసులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజాం రూరల్ సీఐ హెచ్ ఉపేంద్ర రావు, వంగర ఎస్ఐ షేక్ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వంగర: పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎస్‌పి

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దుకు వ్యతిరేకంగా పట్టణంలోని హెడ్ పోస్టాఫీసు వద్ద మంగళవారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టి ముఖ్యమంత్రి చంద్రబాబుకు పోస్టుకార్డులను పోస్ట్ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. కూటమి అధికారంలోకి వస్తే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేసి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇస్తారని కార్మికులు ఆసిస్తే ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు కార్మికులను అప్పగించేందుకు చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.గోపాలం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రసాద్, గౌరీష్, కార్మికులు పాల్గొన్నారు.

పోస్టు కార్డులతో నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

ఎమ్‌డిఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మార్చి 5న బొబ్బిలి ఎనిఒ కార్యాలయం ముందు చేపట్టనున్న ధర్నాను జయప్రమదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు కోరారు. మధ్యాహ్నం భోజనం జిల్లా సంఘం అధ్యక్షులు డి. రామలక్ష్మి అధ్యక్షతన సిపిఎం కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎలిమెంటరీ స్కూల్లో ఒక పిల్లాడికి రూ.5.86, హై స్కూల్ పిల్లలకు రూ.8.57 ప్రభుత్వం చెల్లిస్తుందని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఈ డబ్బులు ఏ మూలకి చాలడం లేదని మధ్యాహ్న భోజన కార్మికులు అప్పులు చేసి పెడుతున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం మెనూ ఛార్జీలు పెంచకపోవడం వల్ల ఒక సందర్భంలో చేతు డబ్బులు కూడా పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 వరకు వంట పని చేస్తే ఇచ్చే కూలి రోజుకి 100 రూపాయలని అన్నారు. మధ్యాహ్నం భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని మెనూ ఛార్జీ పిల్లాడికి రూ.20 పెంచాలని డిమాండ్ చేస్తూ మార్చి 5 ధర్నాలో మధ్యాహ్నం భోజనం కార్మికులందరూ పాల్గొవాలని కోరారు. ఈ సమావేశంలో వై.లలిత, డి.ఆదిలక్ష్మి, లంక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ బాయిలర్ ఊకతో ఇబ్బందులు

కంటి చూపు కోల్పోతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి ఇఐడి ప్యారి సుగర్స్ బాయిలర్‌కు తరలిస్తున్న ఊక లోడ్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక సర్పంచ్ కుప్పిలి దుర్గమ్మ, గవరయ్య, మాజీ ఎంపిటిసి కెంబూరి శ్రీనివాసరావు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఊకలోడుల లారీలను, ఆటో, ద్విచక్ర వాహనాలతో గ్రామస్తులు నిలుపుదల చేశారు. గ్రామ సమీపంలో షుగర్, ఇంధనాలు కర్మాగారాలలో ఉన్న బాయిలర్‌లకు ఊక వేయడంతో వాటి రేణువులు గాలిలో కాలుష్యం అవుతున్నాయన్నారు. దీనికి తోడుగా పాదాచారులు, వాహనదారులకు కంటిలో రేణువుల పడి ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాయిలర్ నుంచి వచ్చే నల్లటి ఊక రేణువులు గాలిలో కలిసి పోయి గ్రామాల్లోకి వెళ్లి కళ్ళల్లో పడి కంటి వ్యాధులు సోకుతున్నాయని, కొంతమందికి కండ్లు పోతున్నాయని చెప్పారు. ఇలా కొనసాగితే సంకిలి, దేవుదల, పుర్లి, చిన్నయ్యపేట గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడతారని చెప్పారు. గతంలో ఇలానే కర్మాగారం యాజమాన్యం ఊక బాయిలర్లకు వేస్తే ఈ ఐదు గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారని అప్పుడు ఊక లోడులు తప్పించి కర్రలు ఏర్పాటు చేశారన్నాని గుర్తు చేశారు. ఈ విషయంపై అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని వారికి నెలవారీ మమ్మూళ్లు అందుతున్నాయని ఆరోపించారు. ఊక లోడులు ఆపకుంటే కర్మాగారం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న కర్మాగార సిబ్బంది గ్రామస్తులతో మాట్లాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఊకలోడులు నిలుపుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం మంగళ వారంతో ముగిసింది. ఎంఇఒలు వరప్రసాదరావు, ఎరకయ్యలు హాజరై అంగన్వాడీ కార్యకర్తలకు కోర్స్ సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణలో నేర్చుకున్న వాటిని అంగన్వాడి కేంద్ర స్థాయిలో అమలు జరపాలని సూచించారు. వీరితోపాటు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడి కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంఇఒలు నాగభూషణరావు, బాలభాస్కరరావు మాట్లాడుతూ అంగనవాడి కేంద్రానికి వచ్చే పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం సకాలంలో అందించాలన్నారు. అంగన్‌వాడీలో పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పిలు ఆర్.శ్రీను, వై.వి. శంకర్రావు, టి.వెంకటరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు కామేశ్వరి, భాగ్యవతి, పాల్గొన్నారు.

వేపాడ: సూచనలు చేస్తున్న ఎంఇఒ నాగభూషణరావు

పూసపాటిరేగ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలకు జరుగుతున్న వృత్యాంతర శిక్షణా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంఇఒలు రాజ్‌కుమార్, పాపినాయుడులు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విషయాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. 120 రోజులు శిక్షణ కార్యక్రమంలో మొదటి విడతగా 6 రోజులు శిక్షణ ముగిసిందన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్సస్ పర్సన్లు, భోగాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్లు, అంగన్వాడి కార్యకర్తలు, మండల విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం యూత్ ఫౌండేషన్ సభ్యులు కీర్తిశేషులు చల్లా సతీష్ జయంతి సందర్భంగా మంగళ వారం స్థానిక కోట జంక్షన్ లోగల విజయ రక్త నిధి కేంద్రంలో విజయనగరం యూత్ ఫౌండేషన్, స్నేహితుల ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 22 మంది రక్తదానం చేశారు. అనంతరం బధిర విద్యార్థుల సమక్షంలో చల్లా సతీష్ జయంతి వేడుకలు జరిగాయి. ఆ తరువాత స్థానిక నరవ జంక్షన్ వద్ద ఉన్న ఎ.ఎమ్.జి కాలనీలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తమాష్, కార్యవర్గ సభ్యులు అనకాపల్లి అశోక్, సాయికుమార్, రాయల్ క్యాబ్స్ శరత్, పి.రఘు పాల్గొన్నారు.

బధిరుల సమక్షంలో చల్లా జయంతి చేస్తున్న యువత

అధిక ధరలకు విక్రయించిన వారిపై కేసులు

ప్రజాశక్తి-విజయనగరం

లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం. దామోదర నాయుడు మంగళవారం రైల్వే స్టేషన్, బస్టాండ్ ఇతర చోట్ల పలు రకాల వ్యాపార సంస్థలపై ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు, ఈ తనిఖీల్లో మొత్తం 8 కేసులు నమోదు చేశారు. తూనిక యంత్రాలకు సీళ్లు లేకపోవడాన్ని గుర్తించి 3 కేసులు, రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో సామాన్య ప్రయాణీకుడిలా పలు దుకాణాల వద్ద శీతల పానీయాలు, తిను బండారాల ప్యాకేజీలు కొనుగోలు చేసి ముద్రించిన అమ్మకపు ధర కంటే అధికంగా విక్రయించినట్లు గుర్తించి వారిపై 5 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వ్యాపారస్థులతో మాట్లాడుతూ వినియోగదారులకు ముద్రించిన ధరకే ప్యాకేజీలు విక్రయించాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారి చెన్నాయ్ దంపతులను సత్కరిస్తున్న వైద్య సిబ్బంది, నాయకులు

వైద్యాధికారి చెన్నాయ్ సేవలు భేష్

ప్రజాశక్తి - గుర్ల

మానవతావాది డాక్టర్ చెన్నాయ్ గుర్ల పిహెచ్‌సి వైద్యాధికారిగా ప్రజలకు విస్తృత వైద్య సేవలు అందించారని ఎంపిడిఒ ఏటి వరప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ సమావేశ భవనంలో మంగళవారం పీజీ చదువుపై వెళ్తున డాక్టర్ చెన్నాయ్‌కి సన్మాన సభ ఏర్పాటు చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు సేవ చేయడంతో పాటు ప్రజలు వ్యాధులు బారిన పడకుండా అవగాహన పరచడంలో ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. హోమియోపతిక్ వైద్యులు డాక్టర్ వెంకటమధు, శ్రీధర్‌లు మాట్లాడుతూ వైద్యాధికారిగా నాలుగేళ్లుగా చెన్నాయ్ అందించిన సేవలు వర్ణనాతీతమన్నారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎవరి పనిని వారు సక్రమంగా నిర్వహించి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో ఓపిక, సహనంగా ఉంటూ తగిన వైద్యాన్ని సకాలంలో అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూడీసీ వి.పద్మావతి, సూపర్ వైజర్లు సురేష్, గణపతి, సుజాత, హెల్త్ అసిస్టెంట్ ఉమా, రాజు, స్టాఫ్ నర్సులు శ్రీదేవి, ఎర్రమ్మ, బేబీ రాణిలతో పాటు ఎంఎల్‌పిహెచ్‌పిలు, ఫార్మాసిస్ట్ ఎం.వెంకటలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ నవీన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అనుమతులు లేకుండా ఎట్టి నిర్మాణాలను చేపట్టరాదని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. మంగళవారం. ఎంఎస్ఎన్ కాలనీలో క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్న సందర్భంగా అనుమతి లేకుండా నిర్మాణం చేపడుతున్న పరిస్థితిని గమనించారు. వెంటనే నిర్మాణాన్ని తొలగించి వేయాలని సిబ్బందికి ఆదేశించారు. దీంతో హుటాహుటిన వెళ్లిన ప్రణాళిక సిబ్బంది భవన నిర్మాణాలను తొలగించారు. పిల్లర్ల వరకు వేసిన నిర్మాణాన్ని కూల్చివేశారు.కచ్చితమైన అనుమతులు మంజూరైన తర్వాత మాత్రమే నిర్మాణాలను చేపట్టాలని చెప్పారు. ఆయా ప్రాంతాలలో రహదారులను ఆక్రమించి ఏర్పాటు చేసిన కార్ షెడ్లను సిబ్బంది తొలగించారు.

జగన్‌పై ఎమ్మెల్యే వ్యాఖ్యలు వెనక్కి తీసుకువాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మాజీ సిఎం జగన్ మెహన్ రెడ్డిపై ఎమ్మెల్యే లోకం మాధవి ఆడిన మాటలు వెనక్కి తీసుకువాలని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాజీ సిఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డిని జోకర్ల మిగిలారని మాట్లాడడం దారుణమన్నారు. ఆ మాటలను ఆమె వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎవరు జోకర్ లాగ ఉన్నారో ప్రజలకు తెలుసన్నారు. నియోజకవర్గంలో ఎవరు హామీలు ఇచ్చి నెరవేర్చకుండా జోకర్ అయ్యారో ప్రజలందరికీ తెలుసన్నారు

నేరాలు ఘోరాలు

అప్పల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - భోగాపురం

అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం.. పూసపాటిరేగ మండలం చింతపల్లి గ్రామానికి చెందిన కిలాన ఎరకారావుకు (33) సుమారు 13 ఏళ్ల కిందట భోగాపురం మండలం బమ్మిడిపేట గ్రామానికి చెందిన దుర్గాతో వివాహమైంది. ఎరకారావు విశాఖపట్నంలో తాపీ పనికి వెళ్లి వస్తుంటాడు. భార్య పిల్లలు అత్త మామతో కలిసి లింగాలవలస సమీపంలో తోటలో కాపలా దారులుగా ఉంటున్నారు. సోమవారం రాత్రి లింగాల వలస వైన్ షాపు వెనుక భాగంలో ఎరకారావు పురుగుల మందు తాగి భార్యకు ఫోన్ చేసి సమాచారం తెలిపాడు. వెంటనే అక్కడికి చేరుకొని ఆటోలో సుందరపేట ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విజయనగరం మహారాజ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. దీనిపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలోని బూసాయవలస గ్రామం వద్ద సోమవారం రాత్రి ఆర్‌టిసి బస్సు ఢీకొని గాయపడిన మడక కృష్ణ (65) చికిత్స పొందుతూ బాడంగి సిహెచ్‌సిలో మంగళవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. విజయనగరం నుంచి వస్తున్న ఆర్‌టిసి బస్సు రోడ్డు దాటుకొని ఇంటికి వెళుతున్న కృష్ణను ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో అతనని బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారని ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.